ఆలయాల అభివృద్ధికి కృషి



ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు



మందముల పరమేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

రామంతాపూర్ : రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఆలయాల్లో అధ్యాత్మిక భావనలు పెంపొందించేలా కమిటీలు కృషి చేయాలని ఎంతో వ్యయ ప్రయాసలతో సర్వాంగ సుందరంగా పోచమ్మ ఆలయాన్ని నిర్మించినందుకు ఆయన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ సీనియర్ నేత పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, డాక్టర్ చారి, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం సాయి కిరణ్, ప్రధాన సలహాదారు లక్ష్మణ్‌ప్రసాద్ శర్మ, అధ్యక్షుడు సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, అనిల్‌గౌడ్, నవీన్‌రెడ్డి, హనుమంతరావు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు : పరమేశ్వర్‌రెడ్డి

ఆలయ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజలు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్లను ఆరాధిస్తే శుభాలు జరుగుతాయని, ప్రతి ఏటా బోనాల పండుగకు అమ్మవార్ల ఆలయాల అభివృద్ధికి ఇచ్చే నిధులను రెట్టింపు చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకార అరుణ్ పటేల్, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మల్కాజిగిరి: సీఎం రిలీఫ్‌ఫండ్‌కు వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. షాలినికి రూ 13,500, శ్రీనివాస్‌కు రూ.8500, జగదీష్‌కు రూ. 41,000 మంజూరయ్యాయని, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తెలిపారు. తుపాకుల జనార్దన్, రాజు, నవీన్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

కార్పొరేటర్ వివరాల సేకరణ



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

మల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నివాసంలో వారి కుటుంబ వివరాలను నమోదు చేశారు. ఎంటమాలజీ మేనేజర్ రమేష్, ఎన్యుమరేటర్ వాణి, వెంకటేష్, సూపర్‌వైజర్ ముఖేష్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

కుషాయిగూడ: డివిజన్‌లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. గత వారంరోజులుగా డివిజన్ వ్యాప్తంగా తలెత్తుతున్న తాగునీటి లోప్రెషర్ సమస్య దృష్ట్యా శుక్రవారం ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాధిక రిజర్వాయర్ నుంచే తాగునీటి సరఫరా తగ్గిన కారణంగానే తాగునీటి లో ప్రెషర్ సమస్య తలెత్తిందని అధికారులు కార్పొరేటర్‌కు వివరించారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సమస్యను తీర్చాలని ఆమె అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి జీఎంను కలిసిన ఎమ్మెల్యే..

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో తాగునీటి సమస్యను మెరుగుపర్చాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారామయాదవ్‌లు శుక్రవారం జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. గౌతంనగర్‌లోని పలు ప్రాంతాల్లో వారానికోసారి తాగునీరు సరఫరా అవుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

మల్కాజిగిరి: మాలలు ఐకమత్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోగల్గుతామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని అంబేడ్కర్‌భవన్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మాలల సత్తా చాటడానికి డిసెంబర్ 1న జరిగే సింహగర్జనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తామంటే ఒప్పుకునేది లేదని, హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాల్సిందేనన్నారు. అంబేడ్కర్ వారసులుగా మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు, నేతలు రాజు, రావుల అంజయ్య, గంగాధర్ కృష్ణ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

మహిళా సమస్యలపై పోరాటం

మల్కాజిగిరి: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఎం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సృజన అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై వేధింపులు, దాడులు ఆగడం లేదన్నారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు మానవ హక్కులే మహిళల హక్కులుగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తామన్న హామీలు అమలయ్యేలా పోరాటం చేస్తామని చెప్పారు. మంగ, నజీమా, లక్ష్మి ,పద్మావతి, నాగమణి, పద్మ, షాహీన్, రాజ్యలక్ష్మి, సుజాత, లలిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

నకిలీ ఆర్టీవో కేసులో మరొకరి అరెస్ట్

ఉప్పల్: నకిలీ ఆర్టీవో కేసులో మరో వ్యక్తిని శుక్రవారం ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రేమ్‌కుమార్‌రెడ్డిని గురువారమే పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. రెండో నిందితుడు సంతోష్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడు ఉదయం 4 గంటలకు తన కారులో బయలుదేరి తనతో పాటు సంతోష్‌ను కూడా తీసుకెళ్లేవాడని తెలుస్తోంది. అతడిని కారులో కూర్చోబెట్టి చిన్న ట్యాప్‌ను వాడుతున్న విధంగా నటిస్తాడు. 'సార్ లోపల ఉన్నాడంటూ'.. ప్రేమ్‌కుమార్ వసూళ్లకు పాల్పడేవాడని సమాచారం. రోజు కూలీ మాత్రమే సంతోష్‌కు వచ్చేదని పోలీసుల విచారణలో తేలింది.

మొక్కుబడిగా సభ్యత్వ నమోదు వద్దు : ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి: పార్టీ సభ్యత్వ నమోదు మొక్కుబడిగా చేయొద్దని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సూచించారు. శుక్రవారం పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో అర్బన్‌జిల్లా సంస్థాగత ఎన్నికల పక్రియ, సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ నాయకులకు నిబద్ధత ఉండాలని, నిర్ణీత సమయం ఉండదని కష్టపడి పనిచేయాలన్నారు.

సమావేశానికి గైర్హాజరుపై..

ప్రజాప్రతినిధులు కావాలనుకునే వారు సమావేశాలకు హాజరుకాకపోవడం మంచిదికాదని హితవు పలికారు. స్థానిక నేతలు, కార్యకర్తలు లేకుంటే పార్టీ ముందుకు సాగదని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ ఎన్నికలకు భిన్నంగా స్థానిక ఎన్నికలు జరుగుతాయని పార్టీ గెలవాలంటే బూత్ కమిటీలు కీలకమని సూచనలు చేశారు.

అందరిని కలుపుకోవాలి..

పాత కొత్త నాయకులను కలుపుకుంటూ సమర్థమైన వారికి బూత్ కమిటీల్లో అవకాశం కల్పించాలన్నారు. సమయం, సత్తా ఉండేవారికి మండల, డివిజన్ కమిటీల్లో చోటు కల్పించాలని చెప్పారు. పార్లమెంట్ పరిధిలో అనుకున్న స్థాయిలో సభ్యత్వ నమోదు కాలేదని నిర్ణీత సమయం పెట్టుకుని పూర్తిచేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఎగిరేది కాషాయం జెండానేనని ధీమా వ్యక్తం చేశారు. తల్లోజు ఆచారి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, చంద్రయ్య, భానుప్రకాష్, వాసంశెట్టి శ్రీనివాస్, వీకే.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి.. చికిత్స పొందుతూ మృతి



నిందితుడు విక్రమ్

మల్కాజిగిరి: భార్య భర్తల మధ్య గొడవ కాస్త భార్య మృతికి కారణమైంది. ఈ ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకోగా.. వారి కుమార్తె అనాథగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ హనుమాన్‌ఘర్ జిల్లా భద్ర గ్రామానికి చెందిన విక్రమ్(38) భార్య సోనీ, కుమార్తె అనిష్క(1)తో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 19న రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య తలపై కర్రతో బలంగా కొట్టగా ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 సాయంతో గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ భార్య మృతి చెందగా.. భర్త ఆస్పత్రి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. చిన్నారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించామని పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని శుక్రవారం ఎల్బీనగర్ ఇంజినీరింగ్ ఎస్‌ఈ నిత్యానందంకు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి భవానీనగర్‌కు వెళ్లే వంతెనకు రూ.94 లక్షలు, కార్తికేయనగర్ పోచమ్మ దేవాలయం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.64 లక్షలు మంజూరై నాలుగేళ్లు గడిచాయన్నారు. పనులు ప్రారంభించకపోవడంతో రూ.64 లక్షల నిధులు తిరిగి టెండర్‌కు పిలిచి నిధులు మంజూరు చేయించాలని ఎస్‌ఈని కోరామన్నారు.

ధర్మపురి కాలనీలో విషాదఛాయలు

ముగిసిన ఆర్యన్‌రెడ్డి అంత్యక్రియలు

ఉప్పల్: అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లి ఏడాది గడవకముందే విగతజీవిగా తిరిగొచ్చిన పాల్వాయి ఆర్యన్‌రెడ్డి (23) అంత్యక్రియలు శుక్రవారం ఉదయం ముగిశాయి. మేడిపల్లిలోని వైకుంఠదామంలో అంత్యక్రియలు జరిపినట్లు బంధువులు తెలిపారు. ఈనెల 13న గన్ పేలడంతో మృతిచెందిన ఆర్యన్ మృతదేహం గురువారం అర్ధరాత్రి ఉప్పల్ ధర్మపురి కాలనీలోని తన ఇంటికి చేరుకుంది. దీంతో బంధువులు, కాలనీవాసులు ఆర్యన్‌ను చూడటానికి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రత్యేక అలంకరణ

గౌతంనగర్: కార్తీకమాసం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ వాణినగర్‌లోని ఉమామహేశ్వర స్వామి శుక్రవారం అర్ధనారీశ్వరస్వామి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అర్ధనారీశ్వర స్వామి అలంకరణలో..

సీఎంను కలిసిన డిప్యూటీ మేయర్



సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ మేయర్ స్రవంతి



మంత్రి శ్రీధర్‌బాబుతో కాంగ్రెస్ నేతలు చెన్నారెడ్డి, మైనంపల్లి

బోడుప్పల్: బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. బోడుప్పల్‌లో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే గురించి వివరించారు. సమ్మక్క సారాలమ్మ జాతర వృత్తాంతం తెలిపే చిత్రపటం జ్ఞాపికను ముఖ్యమంత్రికి ఆమె అందజేశారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నేతలు..

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.చెన్నారెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి శుక్రవారం సెక్రటేరియట్‌లో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి, సంక్షేమ పథకాలను పేదలకు అందేలా కృషి చేయాలని మంత్రి సూచించినట్లు చెప్పారు.

సైన్‌బోర్డుతో సులభంగా చిరునామా గుర్తింపు



సైన్‌బోర్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: సైన్‌బోర్డుల ఏర్పాటుతో చిరునామాల గుర్తింపు సులభతరం అవుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, గుమ్మడి జంపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్, కాలనీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, అమరేంద్రబాబు, వెంకన్నగౌడ్, శ్రీనివాస్, జైసింగ్ ఠాకూర్, కృష్ణమోహన్, మురళీకృష్ణ, రాజు, దాసు, డీఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కాప్రా: సాయిరాంనగర్‌లో నెలకొన్న సమస్యలపై స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కాలనీలో ఉన్న డ్రైనేజీ సామర్థ్యం సరిపోవడంలేదని, దాన్ని విస్తరించడంతో పాటు పైపులైన్ సామర్థ్యాన్ని కూడా పెంచాలని కోరారు. సీసీరోడ్ల మరమ్మతులు, బస్తీ దవాఖానాలో ఫ్లోరింగ్, డబుల్‌బెడ్రూం ఇళ్ల నుంచి యూజీడీ పైపులైన్, వీధిదీపాలు, పవర్ బోర్ల మరమ్మతులు వంటి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సన్మానం..

సాయిరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సన్మానించారు. కాలనీ పర్యటనలో భాగంగా కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు రాజు, సెక్రటరీ తిరుమలేష్‌గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నేతలున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయినగర్, ఆర్‌ఎన్‌ఎస్ రాయల్ మెడోస్, ఆర్‌ఎన్‌ఎస్ డ్రీమ్‌హోమ్స్, ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, పద్మావతి కాలనీ, రాజలింగం కాలనీ, టెలిఫోన్ కాలనీ, అంజయ్య ఎన్‌క్లేవ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- 33/11 కేవీ సాయినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు. మణికంఠనగర్, రాంరెడ్డినగర్, వివేకానందనగర్, శ్రీలక్ష్మినగర్, ఎన్‌ఐఎన్‌కాలనీ, అశోక్‌నగర్, భవానినగర్, రాజలింగం ఫేస్ 1,2, సరస్వతినగర్, విజయపురికాలని, ఉదయ్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామన్నారు.

కాప్రా: సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

కుషాయిగూడ: చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా శనివారం చర్లపల్లి సబ్‌స్టేషన్-1 పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాబురావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్ద చర్లపల్లి ఫీడర్ పరిధిలోని పుకట్‌నగర్, పెద్ద చర్లపల్లి, ఆఫీసర్స్‌కాలనీ, వెంకట్‌రెడ్డినగర్, మధుసూదన్‌రెడ్డినగర్, సిల్వర్‌వోక్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాంపల్లి ఫీడర్ పరిధిలోని చర్లపల్లి వెంచర్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, భరత్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు.

రామంతాపూర్ : చర్చికాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

ఉప్పల్: చిలుకానగర్ 11 కేవి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గణేష్‌నగర్, సెవన్‌హిల్స్ కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, శ్రీనివాసహైట్స్, అపురూప జగపతి హైట్స్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఏఈ నిఖిల్ తెలిపారు.

వెన్నెల గద్దర్‌కు సత్కారం



వెన్నెల గద్దర్‌ను సత్కరిస్తున్న నాయకులు

అల్వాల్: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమితులైన గుమ్మడి వెన్నెల గద్దర్‌ను శుక్రవారం వెంకటాపురంలో పాలమూరు ప్రజల సంఘం నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పాలమూరు ప్రజాసంఘం నాయకులు బైరపోగు సాంబశివుడు మాట్లాడుతూ.. ప్రజాయుద్ధనౌక గద్దర్ ఉద్యమాలు, పోరాటం, పాటలు, మాటలు సమాజాన్ని ఎంతో చైతన్యం చేస్తూ.. ప్రత్యేక తెలంగాణ కోసం చేసిన ఉద్యమం సమాజం మరువదన్నారు. ఆయన కుమార్తెను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. లక్ష్మయ్య, నల్లవల కురుమయ్య, మురళి, రాజేష్, మధు, ఎర్రమన్ను కురుమయ్య, రమేష్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గీతాప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న పార్కులు, సీసీరోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని వాటితో పాటు వాకింగ్‌ట్రాక్, బెంచీలు, సెంటర్ లైటింగ్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్‌లో కాప్రా లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్, కంటి పరీక్షలు, డెంటల్, జనరల్ చెకప్, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. లయన్స్ డిస్టిక్ 320సి ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ ఇన్నారెడ్డి, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ కృష్ణారెడ్డి వైద్యబృందం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం !



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ వెంకటరమణ కాలనీలో విద్యుత్ సిబ్బంది అజాగ్రత్తతో చెట్లకొమ్మలు తొలగిస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను వెంటనే మార్చాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఏడీ రామాచారి, ఏఈ సమ్మయ్య, కాంట్రాక్టర్ కిషోర్, ప్రేమ్, సాజిద్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్

ఉప్పల్: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నగరంలోని నెక్లెస్ రోడ్డులో నిర్వహించే డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమం పోస్టర్‌ను శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని, ముఖ్యంగా యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని దరిచేరనివ్వకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు సహకరించి డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణ విద్యాసమితి అధ్యక్షుడు తారక్‌గౌడ్, ఎస్టీసెల్ చైర్మన్ గణేష్‌నాయక్, అశోక్, సాయినాథ్, శ్రీను, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీసీపీ పద్మజ

మేడిపల్లి: చెడు అలవాట్లకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, మల్కాజిగిరి జోన్ డీసీపీ పద్మజ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జ్ఞానజ్యోతి ఫార్మసీ కళాశాలతో పాటు మేడిపల్లి మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం,సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పానీయాలు, పదార్థాలకు బానిసలైతే విలువైన జీవితం, తమను నమ్ముకున్న తల్లిదండ్రులు, కుటుంబం నాశనం అవుతుందని హితవు పలికారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని విదార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమారుగా 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎన్‌ఏ శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యం



కేంద్రీయ విద్యాలయ విద్యార్థులతో సైంటిస్టులు

ఉప్పల్: కేంద్రీయ విద్యాలయాల నుంచి డీఎన్‌ఏ శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెనెటిక్స్ ఫర్‌యూ సహ వ్యవస్థాపకులు డా. చందనా బసు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ సీడీఎఫ్‌డీలో 'జ్ఞానదీప్' అనే ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డీఎన్‌ఏ, జెనెటిక్ కోడ్‌లు, ఫండమెంటల్ జెనెటిక్స్ ప్రాథమిక అంశాలను విద్యార్థులకు వివరించారు. సైన్స్ కమ్యూనికేషన్ హెడ్ డాక్టర్ వర్ష, డా. శ్వేత త్యాగి, ఇతర సైంటిస్టులు, జంట నగరాలల్లోని వివిధ కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు.